



"వెళ్ళిపోతున్నావేం రామం?''

''కొంచెం పనుందోయ్...;

''పోనీ రెండాట లేసి మానేద్దాం.''

''అబ్బే...చాలా అర్జంటు పనుందోయ్. సారీ మీరు వేసుకోండి'' అంటూ వచ్చేశాడు రామం.

ప్రతిరోజూ ఆఫీసయ్యాక ఆఫీసులోనే సహోద్యోగుల్తో పేకాట ఆడటం అలవాటు రామానికి. కానివాళ జేబులో లక్ష్మీదేవి గలగలలు లేకపోవడంతో ఎలాగోలా మిత్రుల కంటబడకుండా జారుకుందామని ప్రయత్నించినా, వాళ్ళ కళ్ళల్లో పడేసరికి సంజాయిషీ ఇచ్చుకోక తప్పలేదు.

అలవాటుకి బ్రేక్ పడిందన్నది ఒక బాధ అయితే తన వెనుక తన పేకాట మిత్రులు తన మీదెన్ని జోకులు పేల్చి నవ్వుకుంటున్నారా? అన్నదింకో బాధ అయి కూర్చోవడంతో విపరీతంగా ఫీలవుతూ నడుస్తున్నాడు.

ఇటువంటప్పుడు బంగారంవుంటే ఆదుకున్ను. కాని అత్తవారిచ్చిన వుంగరం ఎప్పుడో తాకట్టుకీ ఆ పిమ్మట అమ్మకానికీ వెళ్ళిపోయింది. భార్యగాజులు తాకట్టు పెడదామని తెలిసిన మార్వాడీ దగ్గరికెళ్తే ''పాత అప్పుకి హామీ ఇది'' అంటూ లాక్కున్నాడు. చేతి వాచీని పేకాట్లో పడ్డ బాకీక్రింద అతడి పేకాట ఫ్రండ్ తీసేసుకున్నాడు, ఆ డబ్బులిచ్చేక భద్రంగా తిరిగిచ్చేస్తానంటూ.

ఇంక తాకట్టు పెట్టగల వస్తువులేం లేవు ఇంట్లో గాని, తన దగ్గర గాని. జీతం వచ్చి నాల్రోజులే అయినా అదంతా 'హుష్ కాకీ' అయిపోయింది. క్రితం నెలలో పేకాట 'అరువు'కి ఆడటంతో జీతాల రోజున ఆ అరువు ఇచ్చిన వాళ్ళంతా లాక్కుపోయారు జీతాన్ని. దాంతో కిరాణా కొట్లో పాత బాకీ చెల్లించలేకపోయాడు. అది చెల్లిస్తే గాని మళ్ళీ అరువివనని భీష్మించుకుని కూర్చోవడంతో ఇంట్లోకి ఒక్క సరుకూ తేలేకపోయాడు. వెధవది సరుకుల్లేకపోతే పోయే పేకాటకి పైసల్లేకుండా పోయాయిగదా! ముక్కలు త్రిప్పటం అలవాటైన చేతుల్ని కట్టేసినట్టుగా వుంది. ఏదోలావుంది. మళ్ళీ జీతాలు రావాలంటే ఇరవై ఆర్రోజులు గడవాలి, ఖర్మ!

అసహనంగా, అవమానంగా, విసుగ్గా, చిరాగ్గా, కోపంగా, నీరసంగా వుంది రామానికి. ''ఆఫ్టాల్ పదిరూపాయల్లేక ఫ్రండ్స్‌ముందు ఇన్సల్ట్ అవ్వాల్సొచ్చింది. నిజనిగా హారిబుల్! పదిగాకపోయినా కనీసం అయిదువున్నా ఈపాటికి నాలుగాట లాటలాడేవాడు. రెండాటలైనా కొట్టేవాడు...స్టార్ తిరగాలి గాని ఒక్కరోజులో బాకీలన్నీ తీర్చి తాకట్లు విడిపించెయ్యడూ? ప్చ్...చేతిలో చిల్లిగవ్వ కూడా లేకుండా పోయింది సమయానికి... అనుకుంటూ రోడ్డుమీద కన్పించిన రాళ్ళని కసిగా తన్నుకొంటూ నడవసాగాడు.

తను పోర్షన్ వైపెళ్తుంటే ఓ కుక్క అడ్డొచ్చింది. పెడీమని తన్నాడు. అది వెనుతిరిగి భయంకరంగా మొరిగింది. దాంతో మరీ రెచ్చిపోయి మళ్ళీ కాలెత్తాడు గాని అది కాళ్ళకి బుద్ధి చెప్పింది.

''ఉమా''...బూట్లు తీస్తూ పిల్చాడు పెరటి వేపునున్న భార్యని.

భార్య రాకపోయేసరకి వుగ్రుడైపోతూ ''ఉమా'' అంటూ అరిచాడు ఇల్లు అదిరేలా.

ఆమె పరుగెత్తుకొచ్చింది.

''ఏం జేస్తున్నవే? ఎన్నిసార్లు పిలవాలి ?''

''విన్పించలేదండీ'' భయపడుతూనే అంది.

''విన్పించలేదూ ? అవున్లే. మొగుడనేవాడు ఆఫీసునుంచి అలసి వస్తాడన్న ధ్యాస వుండేడిస్తేగా అనుకోడానికీ! అలా దిష్టిబొమ్మలా నిలబడి చూడకపోతే కాసిని టీ నీళ్ళు నా మొఖాన పొయ్యకూడదూ ?''

''టీపొడి...'' నసిగిందామె.

''లేదంటావ్ ? అంతకంటే ఏమంటావులే. ఎక్కడలేని దరిద్రమంతా నీ దగ్గరే వుంటుంది. ఇంకా అలా నిలుచునే వున్నావేం కాసిని నీళ్ళన్నా తగలెయ్.''

ఆమె పరుగున తెచ్చిచ్చింది.

కాళీ గ్లాసు ఆమె కందిస్తూ ఆమెనీ, ఆమె కట్టుకున్న చీరనీ చూశాడు విసుగ్గా.

మొహం జిడ్డుగా వుంది. బొట్టు సగం చెరిగింది. అక్కడక్కడా చిరగ్గా కుట్టిందేమో కాస్త ఎబ్బెట్టుగా వుంది చీర. మనిషి నీరసంగా లంఖణాలు చేస్తోందాన్లా వుంది !

''ఆ వాలకం ఏమిటీ? వెళ్ళి మొఖం కడుక్కో'' చిరాకు పడ్డాడు.

ఆమె మొఖం చిన్నబుచ్చుకు వెళ్ళిపోయింది తప్ప తనకి ఒంట్లో బావుండలేదన్న సంగతి బయట పెట్టలేదా ఇల్లాలు!

మంచంమీద వెల్లకిలా పడుకున్నాడు రామం.

ఇప్పుడు డబ్బు కావాలి. డబ్బు లేకపోతే ఇంట్లోనూ తన ఒంట్లోనూ కూడా వుత్సాహమే వుండదు. వుత్సాహం లేకపోవడమే కాదు వూపిరాడనట్టుగా వుంటుంది కూడానూ! ఎప్పుడో పెద్ద స్టేక్‌తో పేకాడినప్పుడు చెయ్యి తిరగాలీ, అదృష్టం కలిసి రావాలీ, దెబ్బతో తన దరిద్రం తీరిపోద్ది. అద్సరే ఇప్పటి సంగతి...ఎంతో కొంత అర్జంటుగా సంపాదించాలి ఎలా ?

ఆలోచనలు తెమలటం లేదుగాని ఇంతలో స్కూల్నుంచి పిల్లలొచ్చి అల్లరి చెయ్యసాగారు. ఇదే అదిననుకుని చంటోడు ఆరున్నొక్క రాగం అందుకున్నాడు.

"ఒరేయ్. నోర్మూసుక్కూర్చుంటారా నీవు విమానం మోత మోగించనా ? ఉమా—ఆ చంటోడు ఇందాకట్నుంచి ఏడుస్తోంటే విన్పించడంలేదూ? అబ్బా ! ఇది ఇల్లు కాదు నరకంరా బాబూ..."

వంట చేస్తోందల్లా గబుక్కునొచ్చి పిల్లల్ని వీధిలో కెళ్ళి ఆడుకోమని చెప్పి పంపి, చంటోడ్ని ఎత్తుకుని కళ్ళు తుడుచుకుంటూ వంటింట్లోకెళ్ళి పోయింది ఉమ.

"ఇంట్లో కూర్చుంటే డబ్బెలా వస్తుంది గానీ అలా వూళ్ళోకెళితే ఏ అప్పిచ్చే అప్పారావో దొరకొచ్చు" అనుకుని లేచాడు

"బజారు కెళ్తున్నారండీ" భర్త బట్టలు తొడుక్కోంటోంటే అడిగింది ఉమ.

". .వూ—ఏం?"

"చంటోడికి పాలడబ్బా .."

"వాడికి పాలడబ్బాలు, నీకు చీరెలు, సారెలు, కిరాణా సరుకులు ! ఇవన్నీ తేవడం నాతరం కాదు అన్నిటికీ నన్నే చావమంటే నేనెక్కడ చావను? పోనీ నాలుగొందలు పంపమని మీ నాన్నకి రాయకూడదూ?" అని కోప్పడుతోంటే అతడికో బ్రహ్మాండమైన ఐడియా వచ్చింది ఉమకి ఒంట్లో బావోటంలేదనీ, గుండెనీరసం అని డాక్టర్ చెప్పేడనీ, ఏవో టానిక్కూ ఇంజెక్షన్లూ వాడాలనీ, చంటోడి క్కూడా ఏవో మందులు కంటిన్యువస్‌గా ఇప్పించాల్సొస్తోందనీ అంచేత డబ్బుకి ఇబ్బందిగా వున్న దృష్ట్యా ఓ నాలు గొందలు పంపమని మావగారికి ఉత్తరం రాస్తే? అన్పించించింది. ఆ వుత్తర క్షణాన అదెంతో మంచి ఆలోచననీ, మావగారు తప్పకుండా డబ్బు పంపిస్తారు గనుక ఇంట్లోకి సరుకులూ తేవచ్చు, చిల్లర బాకీలు తీర్చి తనూ ఈ నెల సరదాగా గడిపేయొచ్చన్పించింది.

వెంటనే ఈల వేసుకుంటూ పోస్టాఫీసుకెళ్ళి వుత్తరం రాసి పోస్టు చేశాడు రామం.

నాలుగో రోజున రామానికి టీ యమ్. ఓ. వచ్చింది అతడి మావగారి దగ్గర్నుంచి

"మామావగారు చాలామంచివారు"అనుకున్నాడు డబ్బు అందుకుంటూ. "ఉమ కూడా మంచిదేపాపం. అప్పుడప్పుడూ తనే వూరికే కోప్పడుతూంటాడు. డబ్బు ఇబ్బందులవల్ల అశాంతిగా వుండి అలా ప్రవర్తిస్తున్నాడు గానీ లేకపోతే నెత్తిమీద పెట్టుకుని పూజించేవాడుకాదూ ?" అనుకున్నాడు ఈ డబ్బు

# వ్య స న ం

ఆమెవల్లే వచ్చిందన్న భావన కలగ్గానే. ఇక ఆమెని కష్టపెట్టకూడదని అనుకున్నాడు.

ఎన్నడూ లేంది ఆఫీసవ్వగానే తిన్నగా ఇంటి ముఖం పట్టాడు, ఆనందాశ్వాన్ని అధిరోహించిన రామం.

ఉమ తలపోటుగా వుండటంతో పడుకునివుంది.

"అదేవిటి ఉమా ఈవేళప్పుడు పడుకున్నావ్. ఇంట్లో బావోలేదా?" అతడి కంఠంలో ఆప్యాయత ధ్వనిస్తోన్నా ఆమె కంగారుగా లేవబోయింది.

"ఫర్లేదులే పడుకో" అని ఆమె నుదుటిమీద చేయివేసి చూసి "చాలా వేడిగా వుందే. కొంచెం జ్వరం తగిలినట్లుంది. టాబ్లెట్ తెప్పిస్తానుండు" అంటూ ఆమె వద్దని వారిస్తోన్నా వినకుండా ప్రక్కింటి కుర్రాడ్ని మెడికల్ షాప్‌కి పంపించాడు

ఇంతలో చంటోడు నిద్రలేచి ఏడుస్తోంటే తనే వెళ్ళి ఎత్తుకుని వూరడిస్తూ "ఏమిటో ఉమా. ఈమధ్య ఆఫీసులో పని ఎక్కువయ్యా, ఆర్థిక ఇబ్బందులదృష్ట్యానూ నిన్నెక్కువగా కోప్పడు తున్నాను ఏమీ అనుకోకు ఉమా ఇంకెప్పుడూ అలా ప్రవర్తించను. అయినా ఈ డబ్బు ఇబ్బందులన్నీ పేకాటవల్లే వస్తున్నాయనుకో. అంచేత రేపట్నుంచీ పేకాట పూర్తిగా మానేస్తాను. మన సుఖం కన్నా పేకాట ఎక్కువా చెప్పు? ఆఫీసవ్వగానే తిన్నగా ఇంటి కొచ్చి నీతోనూ, పిల్లల్తోనూ గడిపేస్తాను పిల్లల చదువు గురించి ఇప్పట్నుంచే శ్రద్ధ వహించాలి కూడానూ " అంటూ ఎన్నో కబుర్లు చెప్పాడు రామం జేబు బరువుగా వుండటంతో అవన్నీ వింటూ కలో నిజమో తేల్చుకోలేక కళ్ళప్పగించి చూస్తూండి పోయింది ఉమ

ప్రక్కింటి కుర్రాడు టాబ్లెట్ తేగానే తనే టీ కాసిచ్చాడు భార్యకి మీచేత చేయిస్తున్నానంటూ ఆమె నొచ్చుకుంటే "భార్యాభర్తలిద్దరూ ఒకరికొకరు సాయం చేసుకున్నప్పుడే ఏ సంసారమైనా సుఖంగా, సాఫీగా, సంతృప్తిగా, సంతోషంగా సాగుతుంది ఉమా" అన్నాడు.

భర్తలో వచ్చిన మార్పుకి ఉమ ఏనుగెక్కినంత పంబరపడుతోంది అంత మంచి మార్పు తీసుకొచ్చి నందుకు దేవుళ్ళందరికీ అంజలి ఘటించింది కూడానూ.

ఆ సాయంత్రం ఉమకి వంటలో సాయం చెయ్యడం, పిల్లలచేత స్నానాలు చేయించి బట్టలు తొడగడం, కబుర్లు చెబుతూ భోంచెయ్యడం వగైరా చెయ్యడమే గాక చాన్నాళ్ళ తర్వాత భార్యా పిల్లల్ని సినిమాకి కూడా తీసుకెళ్ళాడు రామం.

సినిమానుంచి వచ్చాక ఆ మర్నాడు ఆఫీసునుంచి రాగానే తామిద్దరూ బజారుకెళ్ళి కావలసిన సరుకులు తెద్దామన్నాడు. ఆమెకి మంచి చీరలు లేవు గనుక ప్రస్తుతం రోజూ కట్టుకునే వో రెండు కొంటాననీ, ఎరియర్స్ రాగానే ఓ మంచి చీర కొంటాననీ అన్నాడు

అతడి మాటలు వింటూ మురిసిపోతూ "ఈ స్వర్గం కలకాలం నిలిచిపోవాలి" అనుకుంటూ భర్త కౌగిట్లో ఒదిగి పోయింది ఉమ

మర్నాడు ఆఫీసు కేంటీన్లో తన మిత్రులతో నవ్వుతూ తుళ్ళుతూ మాట్లాడుతోంటే "నువ్వు లేకపోయేసరికి ఈనాల్రోజులూ పేకాట పరమ బోర్‌గా వుందనుకో. ఇవాళైనాసరే నువ్వు కూడా ఆడాలి. కావలిస్తే మేం డబ్బు అప్పిస్తాం" అన్నారు వాళ్ళు రామంతో

"ఛా—డబ్బుకోసం కాదోయ్"

"మరింకేవిటి గురూ? హోం డిపార్ట్‌మెంటు గొడవ చేస్తోందా, ఎవరో అన్నారు.


"అబ్బే అదేంకాదు గురూ! అర్జంటు పనుండి వెళ్ళిపోయానంతే. ఇవాళ ఆడదాం" అనేశాడు అనకుండా వుండలేక దానికితోడు పేకాటాడి చానాళ్ళయ్యిందంటూ మనసు వుబలాటపడింది కూడానూ. ఓ పది రూపాయల్తో ఆడితే నష్టం ఏవిట్లే? అలవాటైన ఆట గనుక సరదాగానూ వుంటుంది. అదృష్టం కలిసొస్తే నాలుగు డబ్బులు సంపాదించొచ్చుకూడానూ !

ఆఫీసయ్యాక యథాప్రకారం ముక్కలు కలుపుతూ కూర్చున్నారు.

రెండంటే రెండు ఆటలు ఆడి లేచిపోవా లనుకున్నాడు రామం కాని ఆటలు కలిసి రావడంతో ఈమధ్య పోగొట్టుకున్న డబ్బంతా రాబట్టేసుకోవా లనుకున్నాడు ఇన్నాళ్ళకి తన చెయ్యి తిరిగిందనీ, తనకింక షోకా వుండదనీ అనుకుంటూ ఆడాడు.


---

వెల్లటూరు నవరంగ్ చిత్ర కళానికేతన్‌వారు నిర్వహించిన 12వ అఖిలభారత బాలల చిత్రకళా ప్రదర్శనలో ఉత్తమ చిత్రంగా ఎన్నికై స్వర్ణ పతకాన్ని అందుకున్న చిత్రం "బావి వద్ద". (చిత్రకారుడు : చిరంజీవి విజయ్, జి. సహదేవ్)



9వ అఖిలభారత ఔత్సాహిక చిత్రకళా ప్రదర్శనలో ఉత్తమ చిత్రంగా బహుమతి పొందిన "కళాకారుని జీవితం".

(చిత్రకారుడు . శ్రీ టి వి. సత్యనారాయణ)



తృతీయ ప్రాంతీయ ప్రౌఢ చిత్రకళా ప్రదర్శనలో ఉత్తమ చిత్రంగా ఎన్నికై స్వర్ణపతకాన్ని పొందిన తైలవర్ణ చిత్రం "అఖిలభారత వైచిత్రి" (చిత్రకారుడు : శ్రీ ఆర్ హేమాద్రిచెట్టి, తిరుపతి )





# డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

### జి. ఎస్. ఎస్. ఆర్. — వేలకొండపల్లి

నా స్నేహితునికి చేతివ్రేళ్ళ సందుల్లో చిన్న కురుపులు లేచి రాత్రింబవళ్ళు దురదపెడుతున్నదట. వాటిని గిల్లితే నీళ్ళరక్తం వస్తున్నదట ఇలా ఎందువలన వస్తాయి ? వీటికి ఏమి చెయ్యాలి ?

★ పై పూతగా బెంజైల్ బెంజొయేట్ (20 శాతం) వాడాలి. ఈ మందు, బాగా స్నానం చేసిన తర్వాత పూయవలసి ఉంటుంది. మొదటిసారి పూసిన తర్వాత 12 గం॥ల తర్వాత మరోసారి పూయవలసి ఉంటుంది. అలా పూసిన 12 గం॥ల తర్వాత స్నానం చేయాలి. ఇలా వారానికి ఒకసారి వంతున వరుసగా మూడు వారాలు ఈ మందుని వాడాలి

లోనికి పిరిటాన్, అవిల్ వంటి మాత్రలు పూటకి సగం మాత్ర వంతున రోజుకి 3 పూటలుగా వరుసగా వారం రోజులు వాడితే దురదలు తగ్గే అవకాశం ఉన్నది.

ఈ లక్షణం ఉన్నవారు వారి గుడ్డలను వేరే ఉంచి, వేడినీళ్ళలో ఉడికించి ఆరవేసి వాడవలసి ఉంటుంది.

### కె జి. ఎస్. కె. — కుప్పం

సాధారణంగా గొప్పవారికే గుండె జబ్బులు ఎక్కువగా వస్తాయి. కారణం ఏమిటి ?

★ గుండె జబ్బులు అన్ని వర్గాలవారికీ వచ్చే అవకాశం ఉన్నది. గుండెజబ్బుకి డయాబెటిస్, అధిక బ్లడ్ ప్రెషర్, అతి స్థౌల్యం మొదలయినవి దోహదం చేస్తాయి ఈ రోగాలు బాగా శ్రమించి పనిచేసేవారికి ఎక్కువగా రావు శారీరక కష్టం లేనివారికి ఈ రోగం వచ్చే అవకాశం, శ్రమించి పనిచేసేవారికి వచ్చే అవకాశానికన్నా కొద్దిగా ఎక్కువ అనే చెప్పవలసి ఉంది

### డి. టి ఎస్. ఎన్. — శింగరాయపాలెం

నేను ఎన్నో సంవత్సరములనుండి కాలవస్నానం చేస్తాను. ఇంట్లో అన్ని పనులకూ ఆ నీటినే వాడటం అలవాటు. కాని ఈ సంవత్సరము మాత్రము ఇన్ని సంవత్సరములనుండి లేనిది కాలవ లోని మెట్లకు పాచి పట్టి దిగి స్నానము చేయుటకు యిబ్బందిగా వున్నది. ఈ సంవత్సరము మాత్రమే పాచి పట్టుటకు కారణమేమిటి ? ఆ నీరు పాన యోగ్యమగునా ?

★ నీరు ఎక్కడినుంచి లభ్యం అవుతున్నా పరిశుభ్రం చేసిన తర్వాతగాని వాడటం మంచిది కాదు. కనీసం ఆ నీటిని వడపోసి తర్వాత బాగా మరగకాచి త్రాగవలసి ఉంటుంది

పాచి ఎందుకు పడుతుందనేది అందరికీ తెలిసిందే కదా ! శాస్త్రీయంగా నీళ్ళలో ఉన్న బాక్టీరియా, ఫంగై, మొదలయినవి, ఒక విధమైన ఫేరసైటు (చెట్ల తెగకు చెందినది) పాచి పట్టటానికి ముఖ్య కారణాలవుతాయి.

### కె ఎల్. — వైజాగ్

గర్భవతి అయిన నా స్నేహితురాలు బొగ్గులు, పలక పుల్లలు, ఇటుక ముక్కలు, బియ్యం మొదలైనవి తింటుంది. వీటిని తినాలనిపిస్తుంది అంటుంది. ఇవి తింటే ఆమెకుగాని, పుట్టబోయే బిడ్డకుగాని ఏమైనా ప్రమాదమా ? ఇవి తినకుండా వుండుటకు ఏమైనా మందులు వున్నాయా ?

★ గర్భిణిగా ఉన్న సమయంలో "పెర్వర్టెడ్ అప్పిటైట్" ఉండటం కొందరిలో సహజమే! ఇలా చేయటం వల్ల తల్లికిగానీ, పుట్టబోయే బిడ్డకి గాని ఏ విధమైన ప్రమాదమూ ఉండదు ●

---

చిల్లరమల్లర బాకీలన్నీ తీర్చేసి ఫ్రెష్ అయిపోవా లనుకుంటూ వుత్సాహంగా ఆడాడు.

కాని మెల్లగా వచ్చిందీ, తన దగ్గరున్నదీకూడా పోతోంటే తన సొమ్మైనా పూడ్చుకోవాలని కసిగా ఆడాడు. ఇదివరకెన్నడూ ఆడని విధంగా డబ్బుకి కేర్ చెయ్యకుండా ఆడాడు. ఆడేకొద్దీ పోతూనేవుంది తప్ప రావట్లేదు !

మరి రెండు గంటలకే రామం జేబులు ఖాళీ అయిపోయాయ్!

ఒకటీ రెండూ కాదు మూడు వందల ఎనభై రూపాయలు పోయాయ్ !

రామం గుండెలు గుభేలుమన్నాయ్. దుఃఖం పొంగివచ్చింది.

నీరసంగా లేచి తననీ, పేకాటనీ తిట్టుకుంటూ ఇంకెప్పుడూ ఆడకూడదని ఒట్టు పెట్టుకుంటూ ఇంటి ముఖం పట్టాడు.

"అయినా మావగారు ఏడుస్తూ పంపించి వుంటాళ్ళే. అంచేతే ఇలా పోయింది. దానికితోడింట్లో ఎప్పుడూ పోరే ! ఏడ్పులే! ఇంక సిరి నిలవమంటే ఎలా నిలుస్తుంది ?" అని భార్యమీద మండిపడుతూ నడుస్తున్నాడు.

"బాబూ — పైసా ధర్మం సెయ్యండయ్యా" పొట్ట చూపిస్తూ చెయ్యి చాచాడు ముష్టివాడు.

"ఫో. ప్రతివాడికీ అడుక్కోవడం అలవాటయ్యింది. వూరికే వస్తే తిందామనేగాని కష్టపడి తిందామని ఒక్కడికీ లేదు" కసురుకున్నాడు. ఇంటికెళ్ళగానే భార్య కావల్సిన కిరాణా సరుకుల లిస్టు చేతికందిస్తే ఏంజెయ్యటమా అని బుర్ర బద్దలు గొట్టుకుంటూ నడుస్తున్నాడు.

తమ పోర్షన్వైపెళ్తోంటే తమింట్లోంచి ఎవరెవరివో అయిదారుగురి మాటలు విన్పించసాగాయ్. ఇల్లు కొంచెం సందడిగాకూడా వుంది.

రామం గుండెల్లో రాయి పడింది.

"ఒకవేళ... ఒకవేళ..."

అతడి నోటి తడారిపోయింది. గుండె దేన్తోనో పోటీ పడుతున్నట్టు కొట్టుకోసాగింది.

మొన్న భార్యకి ఒంట్లో బావుండలేదని మావగార్కి ఉత్తరం రాసిడబ్బు పంపమన్నాడుకదూ! ఉమ ఆరోగ్యం ఎలాగుందో అన్చెప్పి వాళ్ళంతా కట్టగట్టుకుని రాలేదు కదా ? వాళ్ళు పంపిన డబ్బు తన దగ్గర్లేదు. తమ అవసరాలూ గడవలేదుగాని వాళ్ళొస్తే ఇంకో అంత ఖర్చు ! ఎక్కడా దొరక్క వాళ్ళనడిగితే మళ్ళీ వాళ్ళ గురించెవర్ని బతిమాల గలడు ? పైగా తను అబద్ధాలు వ్రాశావని తెలిస్తే ఎంత అప్రతిష్ఠ ! తన గురించి అత్తామామలూ, బావమరదులూ, వారి భార్యలూ. మరదళ్ళూ, వారి భర్తలూ అంతా హీనంగా అనుకోరూ ? అదోలా చూడరూ ? అయ్యో! ఎంత కర్మొచ్చిపడిందిరా దేవుడా !

ముచ్చెమటలు పోస్తోంటే అడుగులు తడబడుతోంటే లోపలి కెళ్ళడానికి ధైర్యం చాలక, బయట తచ్చాడుతోంటే ఉమ వీధిలోకొచ్చింది. అతణ్ని చూసి గబగబా దగ్గరికొచ్చింది

"ఎవరూ వచ్చింది ?" ఆతృతగా అడిగాడు రామం.

"మా అమ్మా, నాన్నా, చెల్లెళ్ళూ అంతా వచ్చారండి ."

అతడి మొఖంలో రక్తపుబొట్టు కూడా లేదు.

"అయితే నీకు ఒంట్లో బాగోలేదన్న సంగతి .."

"బాగోలేదనే చెప్పాన్లెండి."

"నిజంగా ? థాంక్ గాడ్. లేకపోతే చచ్చే వాణ్ణనుకో. నువ్వు నిజంగా దేవతవి ఉమా."

"దానికేంలెండిగానిప్పుడింట్లో ఏం లేవండీ. ప్రక్కింట్లో టీ పొడీ, పంచదారా తీసుకుని టీ కాసిచ్చాను. మీరు ఆఫీసునుంచి వస్తూ సరుకులు తెస్తారని చెప్పాను. వాళ్ళు చూడకుండా వెళ్ళి ఎలాగోలా అన్ని సరుకులూ, బియ్యమూ పట్రండీ." అంది ప్రాధేయపడుతూ.

తలూపి "దేవుడా!" అనుకుంటూ వెనుదిరిగాడు రామం.

కళ్ళముందు కళ్ళు పొడుచుకున్నా కన్పించనంత చీకటి పరచుకునివుంది ! ★